# అంతం ఎప్పుడో! కదా!

* శ్రీ పట్టెల కృష్ణమూర్తి *

మండుటెండల్లో మలమలమాడి చెమటోడ్చి పంటను పండిస్తాడు రైతు. కండలు కరుగ కర్మాగార ధూమంలో క్రుగ్గి తన నిత్యజీవితయాత్ర గడచేందుకు కూడా చాలీచాలని కూలితో బయటికివస్తాడు కూలి. మెత్తనిహంసతూలికాతల్పంపై కదలలేక పొర్లుతూ వుంటాడు ధనికుడు. "కూలి" ఆ పేరులోనే కనుపిస్తుంది దీనత్వం. "షావుకారు" పేరులోనేవుంది కరకుతనం.

"కూలి" ఆకాశచుంబిత హర్మ్యముల నతి మనోహరంగా నిర్మించి కడతాడు ధనికునికి. తాను వున్నని వానతుంపరలపైనుండైనా కాపాడలేని, నేడో, రేపో, కూలిపోయ్యే పూరింట్లో నివశిస్తూ వుంటాడు. తన వేడిరక్తాన్ని కర్మాగార కదలికపు ధారపోసి కాసులనుండి కాంచనపుష్పాల వరకు ధనరాసుల్ని కూర్చిపెడతాడు పెట్టుబడిదారుడు.

కాని తుదకు తమరోజుకు సరిపోయ్యే కూలిని కూడా పొందలేక బాధపడతాడు.

పగలెల్లా కర్మాగార ధూమంలో కష్టించి సంపాదించిన కూలినితీసుకొని తన భార్యాబిడ్డల్ని చూచుకునేందుకు యింటికి సంతోషంగా చేరతాడు. కాని ఆ నిరుపేద యింటిలో ఆనందదేవతకు బదులు శోకదేవత విలయతాండవం చేస్తూంటుంది. ఇంటికి చేరేసరికి "నాన్నా! ఆకలంటూ" చుట్టూ గుమిగూడుతారు బిడ్డలు. బిడ్డల రోదనలను చూచిన ఆ శ్రామికుని హృదయం వీగిపోతుంది. ఇంతలో భార్య పసిబిడ్డను చేతుల్లో తీసుకొని భర్తను చేరుతుంది. "ఈరోజైనా బిడ్డకు పాలడబ్బా తెచ్చారా! అంటూ.

కూలీలకుకూడా పాలడబ్బాలెందుకని అపహాస్యం చేస్తున్నారా? అలాంటి పెద్దలెవరైనా వుంటే వారిస్థితి నొకసారి తిరిగి అవగాహన చేసుకోండి. వేళకు తిండైనాలేని ఆ మాతృమూర్తిలో పాలెలా వుంటాయి?...

అప్పుడు గుర్తొస్తుంది శ్రామికునికి తన అపరాధం. పాపంతప్పలేకుండా తానుపుదయంకర్మాగారమునకు పోవునప్పుడే గుర్తు చేసింది. బిడ్డకు వచ్చేటప్పుడు పాలడబ్బా తెమ్మని-కాని పగలెల్లా కర్మాగారపు పొగకు క్రుగ్గి బయటపడేసరికి ప్రపంచంలోని చల్లని వాయువుల నాస్వాదించే భాగ్యంకలిగి హృదయం కొంత శాంతిపడుతుంది. భార్యాబిడ్డల చూచి కొన్ని యుగాలైనట్లనిపిస్తుంది. ఇక యితరవిషయాలన్నింటినీ మరచిపోయి త్వరగా యింటికిచేర్తాడు. ఇది రోజూ జరిగేవిషయం.

ఇంతలోనే మాడే కడుపుల్తో, లోతుకు పీక్కుపోయినకండ్లతో యిక ఆగలేక "నాన్నా! ఆకలి" అనిగోల పెడతారు. ఇంతకుముందతని పరిస్థితి అర్థంగాక ఆలోచనా తరంగాలమధ్య మునిగితేల్తున్న అతనికి, బిడ్డలఏడ్పుతో మరల యింటిలోని పరిస్థితులు గుర్తుకొస్తాయి. "ఇప్పుడే 5 నిమిషాలలో మీకు అన్నంతెస్తా! యిదిగో డబ్బులు చూడండి" అంటూ చేతిలోని చిల్లరడబ్బులు పిల్లలకు చూపి తృప్తిపరుస్తాడు. పాలడబ్బామాత్రం మరచిపోకండి అంటూ యిల్లాలర్థిస్తుంది. తనకొచ్చిన కూలితో పాలడబ్బా ఎలా తేగలడు? బిడ్డల ఆకలెలా తీర్చగలడు?

ఇది ఒక మిల్లుకూలి కేశవుని పరిస్థితి-కేశవునికి తల్లిదండ్రులు చిన్ననాడే పోయారు. అతని భార్య, నలుగురు పెద్దపిల్లలు, ఒకపసిపాప తప్ప అతనికి ప్రపంచంలో మరెవ్వరూలేరు.

ఆరోజంతా పాలులేక ఏడ్చీ, ఏడ్చీ శోషిల్లి నిద్రపోయింది. నిరాశతో అతనిపసిపాప "జ్యోతి" నోరెండిపోయివుంది. ప్రపంచమంతటా అప్పటి కప్పుడే చీకటులు వ్యాపిస్తున్నా వేడిగాలి మాత్రం తగ్గలేదు.

కేశవు డారాటంతో బయటికి పరుగెత్తాడు పసిపాప జ్యోతిని పాలడబ్బాతెచ్చి బ్రతికించుకు నేందుకు. కేశవుడు వెళ్ళేసరికి కొట్టు మూసివెయ్య బోతున్నాడు షావుకారు. ఆ పల్లెటూరు కున్నదల్లా ఆకొట్టు ఒక్కటే. అతడు పనిజేసేది ప్రక్కనే 4 మైళ్ళ దూరంలోవున్న పెద్దపట్టణంలో. కేశవుడు ఆత్రంతో "బాబూ! ఒకపాలడబ్బా యివ్వండి యీడబ్బు తీసుకొని" అంటూ అర్థించాడు సెట్టిని.

"కొట్టుకట్టేశాం యిప్పుడు వీల్లేదుపో" అంటూ కసరాడు సెట్టి. "అలాఅంటే వీల్లేదుబాబూ! యిప్పుడో యింకొంచెం సేపటికో (అంటూంటేఅతని హృదయం కంపించింది) అన్నట్లుంది నా పసిపాప "జ్యోతి" ప్రాణం. పాలడబ్బాయిస్తే తొందరగా ఆపాలుపట్టిస్తే బ్రతుకుతుంది. తొందరగా పాల డబ్బాయిచ్చి నాపాపను బ్రతికించండి బాబూ! అంటూ బ్రతిమాలాడు కేశవుడు.

"పగలల్లా కొట్టు తీసేవుంటే తీసుకో గూడదూ?! యిప్పుడు అయ్యా! అయ్యా! అనకపోతే రేపుప్రొద్దున్నేరాపో! ఏం యింతలోకే చచ్చి పోదులే నీబిడ్డ"

అంటూంటే కేశవుని హృదయం రంపపు చక్రాలమధ్య నలిపినట్లయింది. షావుకారు తన బిడ్డని అన్నమాటకి నీళ్ళుతిరిగాయి హృదయం ఝల్లు మంది. వుద్రేకంతో వుడుకురక్తం వుప్పొంగింది. కోపంతో సెట్టిని చేరాంతి కొట్టాడు—అక్కడే కొట్టులోని అలమారులో వున్న పాలడబ్బా తీసుకొని చేతిలోని డబ్బులక్కడనే పారేసి యింటివైపు పరుగెత్తాడు. ఇంతలో షావుకారు తగిలిన దెబ్బలకు తల్లడిల్లి భయంతో [illegible] పెద్దగా కేకలేశాడు.

ఇంతలో చుట్టుప్రక్కల వాళ్ళంతా ఆ ప్రదేశాన్ని చేరారు. సెట్టి జరిగిన పనికి యింకా "కొట్లోని డబ్బు కాజేసి, నా భార్యమెడలోని డబ్బు కాజేసి పోయాడు" అంటూ కల్పించి చెప్పాడు కేశవుని మీద లేనిపోని నేరాలు.

పోలీసులకు రిపోర్టివ్వమని సలహాయిచ్చారు ప్రక్కనే చేరిన పెద్దలంతాను.

కేశవుని యింటిదగ్గర కేశవుడు బయటికి పోయిన పదినిమిషాలకు పసిపాప జ్యోతి కవ్వుమని కేకవేసింది. జ్యోతి రక్తం చల్లబడింది. జ్యోతి తల్లి స్తంభించిపోయింది. బిడ్డలు ఏడుస్తున్నారు. ఆయిల్లపుడొక నరకకూపంగా వుంది.

ఇంతలో కేశవుడు పాలడబ్బాతో యింట్లోకి వస్తూనే భార్య రోదనవిని నిలువునా నీరైపోయాడు. జ్యోతి మంచం ప్రక్కనే జేరి పెద్దగా ఏడ్చాడు. ఏమిచేస్తే ఏంలాభం? "జ్యోతి" జీవితవాయువు అనంతవాయువుల్లో లీనమయ్యాయి. కేశవుని "ఆశా జ్యోతి" ఆరిపోయింది.

ప్రక్కయిండ్లలోని తోటిశ్రామికులంతావచ్చి ఓదారుస్తున్నారు. కాని హృదయం బ్రద్దలయ్యే ఆదృశ్యాల్ని చూస్తున్న ఏజీవి శోకాంబుధి తేలియాడదు. కేశవుని కన్నీటితోనే అభిషేకం జరుగుతోంది జీవంలేని జ్యోతికి. ఎంతో నీరసంగా వున్న జ్యోతితల్లి శోషిల్లి పడిపోయింది.

ఎంతసేపు విచారిస్తేమాత్రం చనిపోయిన "జ్యోతి" బ్రతికివస్తుందా! నీవుకూడా అలా విచారిస్తే ఆబిడ్డల గతేమిటి? అంటూ ఓదారుస్తున్నాడొక వ్యక్తి. పిల్లలను యెత్తుకొని ఆ ప్రదేశాన్నుండి తీసుకొని పోయారు. కొందరిల్లాండ్రు తోటి కార్మికుల సహాయంతో జ్యోతికి దహన సంస్కారాలు జరిపాడు కేశవుడు. కాని మనస్సుమాత్రం మారిపోయింది. పిచ్చిగానవ్వుతాడు. వెర్రిగాకేకలేస్తాడు. కేశవుని మనస్సు చెడింది. ఉన్మాద మావేశించింది.

అంతటి ప్రశాంత నిశీథం కూడా ఆరోజు "జ్యోతి" చావుతో గగ్గోలు పడిందా పేటలో.

ఎన్ని ఘోరాలు జరిగినా, యెంతటి ప్రమాదాలు సంభవించినా, యెన్నిజీవులీ యవనిని బాసిపోయినా! కాలచక్రంమాత్రం తిరుగకాగదుసుమా! తెల్లవారింది...

ఇంతలోనే కేశవుని యింటిని పోలీసులాక్రమించారు. కేశవరావెక్కడ అంటూ గర్జించాడు సబ్‌యిన్‌స్పెక్టరు.

"కేశవరావు, కేశవరావు, యెక్కడ కేశవరావు, రావంటరావు, లేదు, లేదు, అంటూ బయటికి వచ్చాడు కేశవుడు.

అతనేనండి రాత్రి మాయింట్లో చోరీ చేసింది అంటూ చెప్పాడు సెట్టి సబ్‌ఇన్‌స్పెక్టరుగారికి.

నీవు, నీవిక్కడ కెందు కొచ్చావు నా జ్యోతి లేదు. నీవుదీవించినట్లే పోయింది నీకళ్లు చల్లబడ్డాయిగాపో అంటూ కేక లేశాడు. కేశవుడు సెట్టినిచూస్తూ నెం. 217 అతని చేతికి బేడీలెయ్యిఅంటూ ఆర్డరిచ్చాడు యస్. ఐ. గారు యస్. ఐ. హోదాలో.

కేశవుని చేతికి బేడీలేశారు. ప్రక్కనేచూస్తున్న కూలీలకు యిదంతా అగమ్య గోచరంగా వుంది. వారిలో ఒకవ్యక్తి "ఎందుకుబాబూ! పిచ్చెత్తిన కేశవున్నరెస్టు చేశారు, అంటూ ప్రశ్నించాడు.

ఇతడు రాత్రి సెట్టిగారింటిలో చోరీ చేశాడు అంటు ఒక కాన్‌స్టేబిలు గారు చెప్పారు బింకంగా!

ఇంతలోనే కేశవునిభార్య ఏడుస్తూ "వారిని వదలిపెట్టండి బాబూ, వారేమీ యెరుగరు నామాటలు నమ్మండి అంటూ ప్రార్థిస్తుంది.

పోలీసుల హృదయాలేనా కరిగేది. అదంతా పైఅధికారుల యిష్టం. మాదేముంది అంటారు ముక్తసరిగా. యస్. ఐ గారు గర్జిస్తూ "నంగవు నీవూ ఏమీ యెరుగవు" అంటూ ఒక సెట్టు పెట్టాడు దాంతో బక్కచిక్కిన ఆశరీరం అలానే నేలమీద పడిపోయింది.

ఎక్కడవుంది యీమానవ సమాజంలో దయ, ఎక్కడుందీ మానవసమాజంలో నీతి, ఏమీయెరుగని ఆపేదకూలి సంసారాన్ని సర్వనాశనంచేసింది. పదవీ వ్యామోహం యెంతవున్నా, పరిస్థితుల చూచైనా, తమకువచ్చినకేసు నిజమా అబద్ధమా? ఆనైనా ఆలోచించని పెద్దలు పోలీసు వుద్యోగులు.

ఏది ఎలావున్నా కేశవుని "జ్యోతి" ఆరిపోయింది. పిచ్చలోవున్న కేశవుణ్ణి తన దొంగతనాన్ని కప్పి పుచ్చుకునేందుకు పన్నిన పన్నాగమని జైల్లో నానాబాధలు పెడుతున్నారు. హృదయంలేని యీ అధికారులు, పెట్టుబడిదారులు చేసే ఘోరాలు నానాటికి మీరిపోతున్నాయి. కరుణ పూరిత హృదయులుకూలీలే కేశవుడి కుటుంబాన్ని పోషిస్తున్నారు.

కుటిలత్వంతో, క్రుళ్ళుతో నిండివున్న యీ మానవ పెట్టుబడిదారీ సమాజంచేసే ఘోరాలకు అంతం యెప్పుడో కదా? గుండె బీటువార మండు టెండలో కష్టపడి పొలాలలో పంటపండించే రైతులకు, కండలు కరుగ కర్మాగారంలో తమశక్తినంతా ధారవోసే కూలీల కష్టాలకు అంతం యెప్పుడో కదా?

---

## గృహోపయోగానికి పరమాణుశక్తి

పరమాణుశక్తిని గృహోపయోగానికి ఉపయోగించే పరిశోధనలను హార్వెల్ (బ్రిటన్)లోని రెండు పరమాణుశక్తి పరిశోధనాలయాలు కొనసాగిస్తున్నవని, కొన్నిమాసాలలో బ్రిటిష్‌కుటుంబాలు తమ గృహాలలో విద్యుచ్ఛక్తిద్వారా వెచ్చదనాన్ని కలిగించుకొనడానికి బదులుగా పరమాణుశక్తిద్వారానే కలిగించదగు సౌకర్యాలు ఏర్పడగలవనీ లండన్ 'డెయిలీ మిర్రర్' ప్రకటించింది.


కథాంజలి

విడిప్రతి 0-3-0

సంవత్సర చందా 3-4-0

(ప్రత్యేక సంచికలతోసహా)